క్లుప్తంగా

చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలి

- మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్



పులాంగ్ ప్రాంతంలో పనులను పరిశీలిస్తున్న కమిషనర్ దిలీప్‌కుమార్

నిజామాబాద్ సిటీ: డ్రెయినేజీల నుంచి తీసిన చెత్తను ట్రాక్టర్లు, మున్సిపల్ వాహనాల్లో డంపింగ్ యార్డుకు తరలించాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం నగరంలోని బర్కత్‌పుర, వీక్లీబజార్, పులాంగ్ ఏరియాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. శానిటరీ సూపర్‌వైజర్ సాజిద్ అలీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మహిపాల్, సునీల్ ఉన్నారు.

రాష్ట్ర జూడో అసోసియేషన్‌లో జిల్లా వాసులు



అసోసియేషన్ ఎన్నికల అధికారులతో జిల్లావాసులు

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్‌లో నిజామాబాద్ జిల్లా బాధ్యులకు చోటు లభించింది. హైదరాబాద్‌లో రాష్ట్ర సంఘం ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర కమిటీలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించిన జూడో సంఘాల సభ్యులను కీలక స్థానాల్లో ఎన్నుకున్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మేకల అభినవ్, కార్యవర్గ సభ్యురాలిగా ఎల్ అనిత, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా డి నవీన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, ఎన్నికల అధికారులు వీరికి అభినందనలు తెలిపారు.

ఢిల్లీ పరేడ్‌లో పాల్గొన్న కేడెట్లకు అభినందన



కేడెట్‌కు బ్యాడ్జిని అందజేస్తున్న బెటాలియన్ ఆఫీసర్

నిజామాబాద్ అర్బన్: ఢిల్లీలో నిర్వహించిన రిపబ్లిడ్ డే వేడుకల్లో గిరిరాజ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 12వ ఎన్‌సీసీ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ విష్ణు పి నాయర్ శుక్రవారం జీజీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కేడెట్లను ప్రత్యేకంగా అభినందించారు. కేడెట్లకు సర్టిఫికెట్లు, బ్యాడ్జీలను అందజేశారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రామస్వామి, ప్రిన్సిపాల్ పి రామమోహన్‌రెడ్డి, అధ్యాపకులు, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆహ్వానపత్రిక అందజేత



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ఈ నెల 21న నిర్వహించనున్న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలకు రావాలని కోరుతూ తెయూ ఎస్ఎస్‌యూఐ నాయకులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఎస్ఎస్‌యూఐ నాయకులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సాగర్ నాయక్, శ్రీనురాథోడ్, రాము, పృథ్వీ నాయక్, మోహన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సమయానికి 'మీ-సేవ' కేంద్రాన్ని తెరవాలి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తుడు

ఇందల్వాయి: గ్రామంలో ఉన్న 'మీ-సేవ' కేంద్రాన్ని సమయానికి తెరిచేలా చూడాలని నల్లవెల్లి గ్రామస్తులు డిప్యూటీ తహసీల్దార్ శైలజకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఉన్న మీ-సేవ కేంద్రాన్ని సరిగా తెరవక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి మీ-సేవ నిర్వాహకుడిని కేంద్రాన్ని సరిగా నడిచేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పోడు భూములకు పట్టాలు అందిస్తాం

- త్వరలో బంజారాభవన్‌కు రెండెకరాల స్థలం, నిధులు
- సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి



నర్సింగ్‌పల్లిలో నిర్వహించిన భోగ్‌బండార్ కార్యక్రమంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులకు ఆర్‌ఓఎఫ్ఆర్ పట్టాలు అందిస్తామని, భూభారతి గెజిట్ నోటిఫికేషన్ రాగానే ఈ ప్రక్రియ చేపడతామని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాల సందర్భంగా భోగ్‌బండార్ కార్యక్రమాన్ని కాంగ్రెస్ ఆదివాసి గిరిజన జిల్లా చైర్మన్ కెతావత్ యాదగిరి అధ్యక్షతన మంగళవారం మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో ఉన్న ఎస్ఆర్ఎస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు రిజర్వేషన్లు, ఇండ్లు, పోడు పట్టాలు కాంగ్రెస్ ఇచ్చిందని, వైఎస్ఆర్ వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారని గుర్తుచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలోనే అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. భూముల సమస్యల పరిష్కారానికి భూభారతిని త్వరలోనే తీసుకొస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చి భూమిపై హక్కులను లేకుండా చేసిందని విమర్శించారు. విడతలవారీగా ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి తండాల అభివృద్ధికి బాటలు వేస్తామని అన్నారు. ప్రతి తండాకు మండల కేంద్రం నుంచి కనెక్టివిటీ రోడ్లు వేస్తామని తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో బంజారాభవన్‌కు రెండెకరాల స్థలం, భవన నిర్మాణానికి నిధులు ఇచ్చే బాధ్యత తనదని, మీ అందరి మద్దతుతోనే తాను ఎమ్మెల్యేగా గెలుపొందానని గిరిజనులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. మోపాల్‌లో బంజారా భవన్‌కు వెయ్యి గజాల స్థలాన్ని అందజేస్తామని, గిరిజనులకు సేవ చేయడానికే తాను ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నాననే విషయాన్ని గుర్తుంచుకోవాలని, ఏ రాత్రి వచ్చినా ఆదుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధానకార్యదర్శి నగేశ్‌రెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ బాడ్సి శేఖర్ గౌడ్, డీసీసీ ప్రధానకార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, నాయకులు బాగారెడ్డి, భోజన్న, గొర్కంటి లింగన్న, మోహన్ నాయక్, బాబురావు, ప్రతాప్‌సింగ్, ఈశ్వర్ నాయక్, శంకర్ నాయక్, రవి నాయక్, వెంకట్రాం, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఇందూరు గడ్డ బీజేపీకి అడ్డా



బీజేపీ నగర కార్యాలయంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్: ఇందూరు గడ్డ బీజేపీకి అడ్డా అని, ఢిల్లీ ఎన్నికల ఫలితాల తర్వాత రాజకీయాల్లో అనేక మార్పులు వచ్చాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా , బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ నగర కార్యాలయంలో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అర్బన్ నియోజకవర్గ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని, ప్రత్యేక వ్యూహరచనతో ముందుకు సాగాలని సూచించారు. ఎన్నికల హామీల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి రూ.3వేలు, లక్ష ఉద్యోగాలు ఇవ్వలేదని ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు కాక పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని అన్నారు. 317 జీవో విషయంలో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇలాంటి అనేక రకాల సమస్యలపై ప్రశ్నించే గొంతుకలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్యకు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఓటర్లకు వ్యక్తిగతంగా కలుస్తూ వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, నాయకులు నాగోళ్ల లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, కొండా ఆశన్న, మండలాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం



శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పిస్తున్న సభ్యులు

నిజామాబాద్ రూరల్: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహరాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని శబ్ద తరంగిణి సంస్థ అధ్యక్షుడు సేర్ల దయానంద్ అన్నారు. నగరంలోని సరస్వతినగర్‌లో సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం శివాజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శివాజీ భవానీ మాతకు భక్తుడని అన్నారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా శ్రీగోరక్షక సమితి సభ్యుడు ధాత్రిక రమేశ్ మాట్లాడుతూ.. ముస్లిముల సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ప్రకాశ్‌గౌడ్, మహేశ్, గద్దం ధీరేందర్‌రెడ్డి, తొగర్ల సురేశ్, సంతోష్, బాబురావు, ఆడెపు లింబాద్రి, శ్రావణ్‌కుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సొసైటీ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని డాక్టర్ శ్రీశైలం సూచించారు. జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్‌రోడ్‌లో ఉన్న నలంద పాఠశాలలో పిల్లల వైద్యుల సంఘం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం రోడ్డు భద్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ శ్రీశైలం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించి వాహనాలను నడపాలన్నారు. ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపొద్దని అలా చేస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకు రోడ్డు భద్రత నియమాలను వివరించాలని సూచించారు. అంతేకాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ ఏడీఈ తోట రాజశేఖర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆరోగ్యకరమైన జీవితం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సొసైటీ వారు రూపొందించిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను వైద్యులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఆంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, కరిపె రవీందర్, మురళి కృష్ణ, ఇంగు నేహ, తనూజ, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాత డిజైన్ ప్రకారమే 'మంచిప్ప ప్రాజెక్ట్'



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

- ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని నమ్మొద్దు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్: మంచిప్ప ప్రాజెక్ట్ పనులు పాత డిజైన్ ప్రకారమే చేపడతామని, గిరిజనులను కాపాడుకునే బాధ్యత తనదేనని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మోపాల్ మండలంలోని అమ్రాబాద్ జీపీలో ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రాజెక్ట్ పనులు పాత డిజైన్ ప్రకారమే చేపడతామని పీసీసీ అధ్యక్షుడిగా హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ప్రతిపక్షాల అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని సూచించారు. ఇందులో ఎలాంటి అనుమానం లేదని, తాను ఎమ్మెల్యేగా ఉండగానే పాత డిజైన్ ప్రకారం పనులు పూర్తి చేస్తానన్నారు. పూర్తయిన పనులను పాత డిజైన్‌కు ఎలా వాడుకోవాలో నీటిపారుదలశాఖ ఇంజినీర్లతో ఇటీవల సర్వే చేయించామని పేర్కొన్నారు. సర్వే నివేదిక ప్రకారం మంచిప్ప చెరువు ఎత్తు మీటరు వరకు పెంచుతామని, దీని ద్వారా బైరాపూర్ శివారులో ఒక్క గుంట కూడా మునగడం లేదని తెలిపారు. పాత డిజైన్ ప్రకారం పనులు పూర్తి కావాలంటే మరో రూ.600 కోట్ల వరకు అవసరమవుతాయని దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సానుకూలంగా ఉన్నారన్నారు. 22వ ప్యాకేజీ కోసం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని, టన్నెల్ పనుల కోసం అమ్రాబాద్ శివారులో నాలుగు ఎకరాల స్థలం అవసరం ఉంటుందన్నారు. బాధిత రైతుకు భూమికి బదులు భూమి, మెరుగైన పరిహారం ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఇందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. అమ్రాబాద్, బైరాపూర్‌లో ఇక నుంచి అన్నిరకాల అభివృద్ధి పనులు చేపడతామని, అమ్రాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు బాగారెడ్డి, భోజన్న, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, ప్రతాప్ సింగ్, ఈశ్వర్ నాయక్, డాన్ శ్రీను, తండా కారోబార్లు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛంద రక్తదాన శిబిరం

మోపాల్: శివాజీ మహరాజ్ సేవా సమితి ఆధ్వర్యంలో నగర శివారులోని బోర్గాం(పి) ప్రధాన చౌరస్తాలో తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం బుధవారం ఉదయం 9 గంటలకు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. రక్తదాన శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల హాజరుకానున్నారు.

ఖానాపూర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు

నిజామాబాద్ రూరల్: ఒకటో డివిజన్ పరిధిలోని ఖానాపూర్‌లో మంగళవారం సన్‌రైజ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు ఆస్పత్రి సిబ్బంది ఉచితంగా బీపీ, షుగర్, పలు టెస్టులు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, బీజేవైఎం నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లు పొందిన వారితో సీఐ శ్రీనివాసరాజు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండోటౌన్ పీస్‌లో సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటీ రిజిస్టర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న తొమ్మిది మంది బాధితులకు టౌన్ సీఐ రాజశేఖర్‌రాజు మంగళవారం ఫోన్లను అందజేశారు. ఫోన్ పోయిన వారు వెంటనే పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై యాసిన్ అరాఫత్, కానిస్టేబుల్ రాములు పాల్గొన్నారు.

బాలికలు చదువును మధ్యలో ఆపొద్దు

డొంకేశ్వర్(ఆర్మూర్): బాలికలు ఎన్ని ఆటంకాలు ఎదురైనా సరే చదువును మాత్రం ఆపకూడదని ఐసీడీఎస్ అధికారులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. అక్షరాస్యత, లింగ సమానత్వం, బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ అన్నపూర్ణ, పుష్ప, జమ్రు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

'ఉపాధి' చెల్లింపులు రూ.2.69 కోట్లు



ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో సాయాగౌడ్

- డీఆర్డీవో సాయాగౌడ్

రెంజల్(బోధన్): ఉపాధి హామీ ద్వారా రెంజల్ మండలంలోని ఆయా గ్రామాల్లో 287 పనులు చేపట్టి రూ.2కోట్ల 69 లక్షలు కూలీలకు చెల్లించామని డీఆర్డీవో సాయాగౌడ్ తెలిపారు. అలాగే రూ. కోటి 7లక్షలతో రోడ్లు, డ్రెయినేజీలు తదితర 26 పనులు చేపట్టినట్లు వివరించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం 2023 - 24 సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ ప్రజావేదికను నిర్వహించారు. సామాజిక కార్యకర్తలు ఆయా గ్రామాల నివేదికలను చదివి వినిపించారు. కొన్ని గ్రామాల్లో పనులు చేసిన కూలీలకు సాంకేతిక సమ స్యల కారణంగా చెల్లింపులు జరగలేదని, మరికొన్ని గ్రామాల్లో అదనపు చెల్లింపులు జ రిగాయని తేలింది. ఎంపీడీవో వెంకటేశ్‌జాద వ్, సామాజిక తనిఖీ అధికారులు అంజద్ అలీ, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	88,700	వెండి(కిలో)	1,01,000
22 క్యారెట్స్	81,862		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	30	50
బెండకాయ	50	80	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	80	దోసకాయ	30	50
దొండకాయ	30	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	10	20	బీట్‌రూట్	30	50
పాలకూర	10	20	కరివేపాకు	60	110
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	35	60
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 ఛావా(హిందీ)- 11.00, 1.40, 10.20
తండేల్(తెలుగు)-4.35, 7.30

స్క్రీన్-2 తండేల్(తెలుగు)-11.00,1.45,7.40, 10.20 -ఛావా(హిందీ)-4.30

స్క్రీన్-3 లైలా(తెలుగు)-10.45,1.45,7.35, 10.20
బ్రహ్మ ఆనందం(తెలుగు)- 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 కెప్టెన్ అమెరికా(తెలుగు)-10.45, 7.20
లైలా(తెలుగు)-1.25
తండేల్(తెలుగు)-4.15, 10.00

స్క్రీన్-2 ఛావా(హిందీ)-10.00, 4.00, 10.25
కెప్టెన్ అమెరికా(3డీ తెలుగు)-1.20
తండేల్(తెలుగు)-7.25

స్క్రీన్-3 తండేల్(తెలుగు)-10.30
నిదురించు జహాపన(తెలుగు)-1.35
లైలా(తెలుగు)-4.10
ఛావా(హిందీ)-7.00
సనమ్ తేరి కసమ్(హిందీ)-10.20

స్క్రీన్ -4 తల(తెలుగు)-10.55
సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-1.35, 7.40 - బ్రహ్మ ఆనందం(తెలుగు)-4.35
లైలా(తెలుగు)-10.40

లలితామహల్ తండేల్(తెలుగు)

దేవి లైలా (తెలుగు)

నటరాజ్ ఛావా(హిందీ)

విజయ్ సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)

ఎస్‌బీ తండాలో రైతుల ఆందోళన



ఎస్‌బీ తండాలో ఆందోళన చేస్తున్న రైతులు

ధర్పల్లి: మండలంలోని ఎస్‌బీ తండాలో రైతు భరోసా డబ్బులు తమ ఖాతాలో ప్రభుత్వం జమ చేయలేదని పలువురు గిరిజన రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. పట్టా పాస్ పుస్తకాలను చేతిలో పట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పూర్తిస్థాయిలో రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలని, తక్షణమే రైతు భరోసా డబ్బులను ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.